


***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ ద్వీపే డొయిచ్ ఖండే

# చివరి విడత: మలి సందడి (13)

# (అనుమతి పాట్లు బెర్లిన్‌లో నేను, నా కుటుంబం)

**రోజూ ఊపిరి** తీసుకున్నట్లే – చాలా ముఖ్య విశేషాలు కొన్ని మనకు తెలియకుండానే జరిగిపోతుంటాయి.

తెలిసినవారికి ఈ మాత్రం తెలియదా అనిపిస్తుంది కానీ తెలియనివారికి చిన్న విషయం కూడా విశేషమే.

బాగా చిన్నప్పుడు నాకు బస్సు ప్రయాణమంటే తెలియదు. ఎక్కి కూర్చోవడమే అనుకునేవాణ్ణి.

టికెట్లు పెద్దలు తీసుకునేవారు. అది నా దృష్టికొచ్చేది కాదు.

నాకంటే చిన్నపిల్లలు కొందరికి ఆ విషయం తెలుసని గ్రహించేక, నా పరిమిత జ్ఞానానికి సిగ్గు పడ్డాను.

నాకు నాలుగేళ్లప్పుడు కాబోలు, మా బాబాయిగారు ఓ దుకాణంలో మనీపర్సు కొన్నారు.

ఇంటికొచ్చేక మా పిన్ని ఆయన్ని దేనికో డబ్బులడిగింది.

‘‘అంత డబ్బు లేదు. వచ్చే నెల చూద్దాంలే’’ అన్నారు బాబాయి.

‘‘డబ్బు లేదంటారేమిటీ – ఇప్పుడేగా మనీపర్సు కొన్నారు!’’ అన్నాను.

బాబాయి ఆశ్చర్యపడి, ‘‘మనీపర్సుకెంతయిందీ – అర్థరూపాయేగా!’’ అన్నారు.

‘‘అది నాకు తెలియదు. పర్సులో బోలెడు డబ్బుంటుందిగా, దాని గురించి’’ అన్నాను.

పర్సులో డబ్బు మనం పెట్టాలని నాకు తెలియదు. పర్సు కొనుక్కుంటే అందులో డబ్బుంటుందని అప్పటిదాకా నా అభిప్రాయం.

నాకూ ఓ అర్థ రూపాయుంటే నేనూ ఓ మనీపర్సు కొనుక్కుని బోలెడు డబ్బు ఖర్చు పెట్టొచ్చు ననుకునేవాణ్ణి.

అది తెలిసేక పిన్ని, బాబాయి ఒకటే నవ్వు.

నాకూ నా పొరపాటు అర్థమయింది.

అర్థరూపాయికి ఎవరైనా వందల రూపాయలుంచిన పర్సుని అమ్ముతారా?

అలా ఆలోచించగానే అంతవరకూ ఆ మాత్రం స్ఫురించని నా తెలివితక్కువతనానికి చాలా సిగ్గుపడ్డాను.

అలాంటిదే ఇప్పుడు జర్మనీలోనూ జరిగింది.

ఇండియాలో ఉండగా నేనెప్పుడూ విదేశాల్లో అవకాశాలకి ప్రయత్నించలేదు. కానీ మిత్రుల ద్వారా కొన్ని విశేషాలు తెలిసేవి.

ఆంగ్లభాషా నైపుణ్యాన్ని నిర్ధారించడానికి టోఫెల్ ఇవ్వాలని తెలుసు.

అమెరికాకి ఐతే పది పన్నెండువేలు పెట్టి టికెట్ కొనుక్కోవాలని తెలుసు.

ప్రయాణంలో డాలర్లవంటి విదేశీమారకం కొంత ఉండాలని తెలుసు.

వీసా గురించి తెలియదు.

నేను జర్మనీకి ఎంపికైనప్పుడు టికెట్టుతో సహా అన్ని ఏర్పాట్లూ డాడ్ సంస్థ చేసింది.

అందులో జర్మనీలో ఉండడానికి అనుమతిపత్రం కూడా ఉందని నాకు తెలియదు.

నావరకూ కొద్దిగా విదేశీమారకం నేను ఏర్పాటు చేసుకున్నాను. అది సరిపోయింది.

ఆతర్వాతనుంచి అన్నీ వాళ్లే చూసుకున్నారు.

శ్రీమతినీ, పిల్లల్నీ జర్మనీ రప్పించినప్పుడు డాడ్ వాళ్లకి తెలియబర్చాలి కాబట్టి తెలియబర్చాను.

టికెట్లు కొనడానికి డబ్బు పోగేశాను.

ప్రయాణపు ఏర్పాట్లకు నా తంటాలు నేను పడ్డాను.

వాళ్లిక్కడికి చేరగానే యజ్ఞం పూర్తయిందనుకున్నాను.

మావాళ్లొచ్చిన వారం పదిరోజులకి నాకక్కడున్న మంచిమిత్రుల్లో ఒకడైన గుప్తా కనిపించాడు.

అతడి భార్య, రెండేళ్లలోపు కొడుకు మావాళ్లకంటే కాస్త ముందే వచ్చారు.

వాళ్లకి రెసిడెన్స్ పెర్మిట్ కోసం దరఖాస్తు పెడుతున్న విషయం యథాలాపంగా చెప్పాడు.

''వాళ్లొస్తున్నట్లు డాడ్ సంస్థకి చెప్పాం. మన డబ్బు ఖర్చు పెట్టి టికెట్లు కొన్నాం. మనకొచ్చే స్కాలరుషిప్పు డబ్బుతో మనవాళ్లని పోషించుకుంటాం. మళ్లీ కొత్తగా ఈ అనుమతి పత్రమేమిటి?'' అన్నాను కాస్త ఆశ్చర్యంగానూ, భయంగానూ.

''ఒక దేశంనుంచి ఇంకో దేశం వెళ్లడానికి టికెట్ కొంటే సరిపోదు కదా! ముందు మనకి పాస్‌పోర్టు ఉండాలి. అలాగే మనం వేరే దేశంలో ఉండాలంటే – ఆ దేశం మనని అనుమతించాలి కదా!'' అన్నాడు గుప్తా.

నిజమే – అది కామన్ సెన్సుకి సంబంధించిన విషయం.

ఇంతవరకూ నాకిది స్ఫురించలేదేమిటి?

అప్పుడనిపించింది – ఇలాంటి విషయాల్లో నాకు కనీస లోకజ్ఞానం లేదని.

స్కూల్లో ఫీజులు కట్టాలని తెలియదు. పెద్దలు కట్టేవారు.

కాలేజికి అప్లికేషన్సు పెట్టడం తెలియదు.

నాన్నగారో, తాతగారో, లేకా చదువయ్యేదాకా నాకు క్లాసుమేటైన నా అన్నయ్యో –

ఇంతా చేసి అన్నయ్య నాకంటే ఒకే ఒక్క ఏడాది పెద్ద.

తెరిచినప్పుడు స్కూలుకి, కాలేజికి వెళ్లేవాణ్ణి.

పరీక్షలొస్తే వ్రాసేవాణ్ణి.

వాటి వెనుక ఉండే అప్లికేషన్లు, ఫీజులు తతంగం తెలియకుండానే నేను ఎమ్మెస్సీ అనిపించుకున్నాను.

కష్టపడి వాళ్ల ఏర్పాట్లు వాళ్లే చేసుకునేవాళ్లకి మాత్రం – నాలాంటివాళ్లకి ఈ మాత్రం తెలియదంటే ఆశ్చర్యంగా అనిపించొచ్చు.

క్లాసులో సబ్జక్టులో అధ్యాపకులు వివరించడమయ్యేక – సందేహాలకోసం నాదగ్గరకొచ్చేవాళ్లని చూసి – ఈ మాత్రం అర్థం కాలేదా – అని నేనాశ్చర్యపడేవాణ్ణిగా – అలాగే ఈ విషయంలో నాగురించి కొందరనుకోవచ్చు.

అలాగని మేమేం డబ్బులో మునిగి తేలడం లేదు. నాకు అలా సాగిందంతే!

కంటితో చూస్తే భూమి బల్లపరుపుగా ఉంటుంది.

ఆలొచిస్తేనో, ఆలోచించినవాళ్లు చెబితేనో అది గుండ్రమౌతుంది.

డాడ్ వాళ్లు కడుపులో చల్ల కదలకుండా నాకోసం అన్ని ఏర్పాట్లూ చేశారు.

దాంతో విదేశ యానానికి సంబంధించి నేనుకనీస లోకజ్ఞానానికి దూరమయ్యాను.

కాస్త ఆలోచిస్తే చాలా తెలిసేవేమో –

ఒక్కణ్ణే ఉన్నప్పుడు లియోపాట్‌జ్‌విల్లేలో హాస్టల్లో ఉంటున్న ఎలక్ట్రికల్ ఇంజనీర్ దాస్ కథ విని అబ్బురపడ్డాను.

అతడి దృక్పథం, సాహసం, ఉన్నతలక్ష్యం నన్ను ఆకర్షించాయి.

కానీ, ఆ కథలో అంతర్లీనంగా ఉన్న రెసిడెన్స్ పెర్మిట్ ప్రసక్తిని గ్రహించి, మావాళ్లకి అన్వయించుకునే ఇంగితం నాకు లేకపోయింది.

గుప్తాతో మాట్లాడేక నాకు స్పష్టమయింది –

టికెట్ కొనుక్కుని ఇండియానుంచి జర్మనీ వచ్చిన నా కుటుంబం – మూడునెల్లపాటు ఇక్కడ నిరభ్యంతరంగా గడపొచ్చు.

రెసిడెన్స్ పెర్మిట్ లేకపోతే మూడునెల్ల తర్వాత ఒక్క రోజు కూడా ఇక్కడుండడానికి వీల్లేదు.

గుప్తా తన భార్యకి రెసిడెన్స్ పెర్మిట్ కోసం అప్లికేషన్ ఇచ్చేట్ట.

"నువ్వూ ఇచ్చావా?" అని యథాలాపంగా అడిగాడు.

ఇంకా ఇవ్వలేదని తెలియగానే, వెంటనే అప్లై చెయ్యమని తొందరపెట్టాడు.

"నువ్వు చాలా స్మార్ట్. ఇలాంటివన్నీ ముందే భలే తెలుసుకుంటావ్" అన్నాను.

పాపం గుప్తాకి అలాంటి పొగడ్తలు విన్నప్పుడు తనకి గొప్పతనాన్ని ఆపాదించుకునే అలవాటు లేదు.

"అలాంటిదేం లేదు. హాస్టల్లో ఉంటున్నాగా, ఎవరో ఒకరు ఇలాంటివి చెబుతుంటారు. అంతే!" అన్నాడు.

మావాళ్లు వచ్చీరాగానే ఈ రెసిడెన్స్ పెర్మిట్ గురించి పట్టించుకోనందుకు ముందు కంగారు పడ్డాను.

ఐతే గుప్తా నాకు ధైర్యం చెప్పాడు.

డాడ్ స్కాలర్సు విషయంలో – ఈ పెర్మిషన్ ఒక ఫార్మాలిటీయేనట.

ఎటొచ్చీ ముందు అప్లై చెయ్యాలిట.

ఒకసారి అప్లై చేసేక, ఇక బంతి వాళ్ల కోర్టులో ఉంటుంది.

వాళ్లు నిర్ణయం తీసుకొనడంలో ఆలస్యం చేస్తే కూడా మాకే ఇబ్బందీ లేదు.

నిర్ణయమయ్యేదాకా మా వాళ్లిక్కడే ఉండొచ్చు.

"ఐనా ఇక్కడ మన దేశంలోలా కాదు. మనం అప్లికేషనిచ్చేక వాళ్ల ప్రొసీజర్సు వాళ్లు అనుసరించి, మనకి పెర్మిషన్ ఇవ్వడానికి ఎంతో కాలం పట్టదులే" అన్నాడు గుప్తా.

గుప్తా అప్లికేషనిచ్చి మూడు రోజులయిందిట.

అప్లికేషనిచ్చినప్పుడు భార్యనీ, కొడుకునీ తీసుకెళ్లేట్ట.

ఇంటర్వ్యూ బాగానే అయిందిట.

ఆఫీసరు ప్రసన్నంగా ఉన్నాడట.

ఎటొచ్చీ భార్యాబిడ్డలకి ఇన్సూరెన్సు తీసుకుని మళ్లీ రమ్మన్నాడుట.

"అంటే నేనిప్పుడు మావాళ్లకి ఇన్సూరెన్సు తీసుకోవాలన్న మాట!" అన్నాను.

గుప్తా నవ్వి, "రెసిడెన్స్ పెర్మిట్ ఆఫీసు చిత్రమైనది. ఇక్కడ ఒకొక్కరికి ఒకోలా ఉంటాయిట నియమాలు. నువ్వు నీ భార్యాబిడ్డల్ని తీసుకుని తొందరగా ఆ ఆఫీసుకెళ్లు. వాళ్లు మీవాళ్లకి ఇన్సూరెన్సు కావాలనొచ్చు, వద్దనొచ్చు కూడా. అడిగినవి నోట్ చేసుకో. అడగని వాటి విషయం పొరపాటున కూడా ప్రస్తావించకు" అని సలహా ఇచ్చాడు గుప్తా.

సరేనని గుప్తా దగ్గర ఆ ఆఫీసు వివరాలు తెలుసుకున్నాను.

అది పుట్‌కామర్ స్ట్రాసే (వీధి)లో ఉంది.

అక్కడికి వెళ్లడానికి మా ఇంటినుంచి రెండు ఊబాన్లు మారాలి.

జనవరి 21 ఉదయాన నేను, నాకుటుంబం పెందరాళే తెమిలి – 9.30కల్లా ఆ ఆఫీసు చేరుకున్నాం.

అక్కడ వివిధ దేశాల రంగురంగుల జనాలతో మహా సందడిగా ఉంది.

ఉన్నవాళ్లలో ఎక్కువమంది టర్కీ వాళ్లు.

ఒకొక్కర్నే పిల్చి ఇంటర్వ్యూ చేస్తున్నారు.

అదయ్యేక పని సానుకూలమైనవాళ్లు అత్యుత్సాహంగానూ, కానివాళ్లు నీరసంగానూ బయటికొస్తున్నారు.

మా వంతు రావడం కాస్త ఆలస్యమయింది.

కారణ మేమిటంటే – మా ముందు ఇంటర్వ్యూకెళ్లిన ఓ టర్కిష్ అతనికి నలుగురు భార్యలు.

ఒక భార్య ఇక్కడే ఉంటోంది.

మిగతా ముగ్గురి భార్యలకీ రెసిడెన్స్ పెర్మిట్ కోసం వచ్చాడు.

ఒక మగాడికి ఒకే భార్య, ఒక మహిళకి ఒకే భర్త – అంటుంది జర్మనీ రాజ్యాంగం.

నలుగుర్నీ నేను చట్టబద్ధంగానే పెళ్లాడానంటాడు టర్కిష్ వ్యక్తి.

అదిక్కడ చెల్లదంటాడు అక్కడి ఆఫీసరు.

ఆ విషయం అప్లికేషన్లో ఎక్కడా ప్రస్తావించలేదని అంటాడు టర్కిష్ వ్యక్తి.

వ్రాయకపోయినా అర్థం చేసుకోవాలంటాడు ఆఫీసరు.

అలాగైతే తను చట్టబద్ధంగా నలుగుర్ని పెళ్లి చేసుకోవడాన్నీ అర్థం చేసుకోవాలంటాడు టర్కిష్ వ్యక్తి.

వాళ్లమధ్య వాదులాట కొనసాగుతూ మిగతావాళ్లకి బాగా ఆలస్యమైపోతోంది.

వచ్చిన సమస్యేమిటంటే – జర్మనీలో ఉద్యోగస్థులకి వారి భార్యలకని వేరే కొంత డబ్బు అలవెన్సుగా ఇస్తారు. అలాంటి అలవెన్సుకోసం నలుగురు భార్యల్ని తీసుకొచ్చిన సందర్భం ఆ ఆఫీసరు అనుభవంలో ఇదే మొదటిది.

మాకిది కొంచెం వినోదంగానే ఉన్నా – టైము పదిన్నర కావస్తుంటే కొంత విసుగొచ్చింది.

అక్కడ ఏ దేశస్థురాలో తెలియదు కానీ, ఓ తెల్లామె మమ్మల్ని గమనిస్తోంది.

మా పిల్లల్ని ముచ్చటగా చుస్తోంది.

నా శ్రీమతి కట్టూ బొట్టూ ఆమెకి ఆశ్చర్యాన్నీ, కుతూహలాన్నీ కలిగిస్తోంది.

ఆమె శ్రీమతిని ఇంగ్లీషులో పలకరించి – ‘‘ఇండియా?!’’ అంది.

శ్రీమతికి ఇండియా అన్న పదమొక్కటే అర్థమై చిరునవ్వుతో తలాడించింది.

‘‘కాలక్షేపంగా ఉంటుంది. ఇవి తినండి’’ అంటూ అభిమానంగా నవ్వి ఓ చిన్న ప్యాకెట్ శ్రీమతికిచ్చింది.

శ్రీమతి మొహమాటంగానే తీసుకుని, ఆమెకి థాంక్స్ చెప్పింది.

అది చిన్న పోలిథీన్ సంచి. లోపలున్నవి స్పష్టంగా కనిపిస్తున్నాయి.

అవి నిమ్మతొనలని అర్థమై – పాపకిచ్చి – ‘‘నువ్వూ, తమ్ముడూ తినండి’’ అంది.

మా పిల్లలు ఓ పట్టాన ఏది పడితే అది తినరు.

జర్మనీలో పిల్లలంతా ఇష్టపడి తినే చాక్లెట్లే వీళ్లకి నచ్చేవి కాదు.

వాళ్లూ వీళ్లూ ఇచ్చిన చాక్లెట్లు ఇంట్లో పేరుకుపోతుంటే – కొన్ని ఇంటికొచ్చినవాళ్లకి ఇచ్చేవాళ్లం.

కొన్ని శ్రీమతి అయిష్టంగానే తినేది.

కొన్ని ఇండియా తీసుకెడదామని దాచేవాళ్లం.

''తినరా తమ్ముడూ'' అని పాప బాబుకి ఆ ప్యాకెట్టిచ్చింది.

బాబు దాన్ని ఓసారి ఎగాదిగా చూసి వాళ్ల అమ్మకిచ్చేశాడు.

ప్యాకెట్ ఆమెకి వెనక్కిచ్చెయ్యమని శ్రీమతి నాకిచ్చింది.

''పిల్లలు తినడానికి ఇష్టపడ్డంలేదు'' అని నేనామెకి ప్యాకెట్ వెనక్కివ్వబోయాను.

ఆమె తీసుకోలేదు.

''నా పిల్లలూ ఇంతే – నేనిచ్చింది తినరు. ఐతే, నేనే తివేస్తా – అని ఒకటి నోట్లో వేసుకుంటా. అంతే వాళ్లు ఎగబడి లాక్కుంటారు'' అందామె.

నేను తటపటాయిస్తుంటే – ''నేను చెప్పినట్లు చేయి'' అంది కొంచెం గద్దిస్తున్నట్లు.

''మావాళ్లు అలా తినరు'' అన్నాను.

ఆమె నవ్వి, ''నేనెందుకు చెబుతున్నానంటే – వీటి రుచి వెరీ స్పెషల్. ఇవి అన్నిచోట్లా దొరకవు. నీ భార్య ఒకసారి నోట్లో వేసుకుందంటే – అడిగినా పిల్లలకి పెట్టదు. ఇద్దరూ రుచి చూడండి, అదీ నీ భార్య నీదాకా రానిస్తే'' అని చిలిపిగా కన్ను కొట్టింది.

నేనామె ఏమంటున్నదీ చెప్పబోతే – ''ఆమాత్రం ఇంగ్లీషు నాకూ అర్థమయింది లెండి కానీ – ఆ చెప్పేదేదో చెప్పి ఊరుకోవచ్చుగా, కన్ను కొట్టడమెందుకూ?'' ఆని చిరాకు పడింది.

కొంత కుతూహలం. కొంత మొహమాటం.

శ్రీమతి నిమ్మతొన ఒకటి రుచి చూసింది.

ఆమె కళ్లు పెద్దవవడం చూసి వాటి రుచి నాకు అర్థమైంది.

తనకి నచ్చినవి వెంటనే నాతో షేర్ చేసుకోవాలిగా – వెంటనే నాకో నిమ్మతొన ఇచ్చింది.

నిజంగానే ఆ నిమ్మతొనల రుచి అద్భుతం.

శ్రీమతి నాతో అంది, ''నా చిన్నప్పుడు నిమ్మతొనలు కొనుక్కుని తినేవాళ్లం. చాలా రుచిగా ఉండేవి. మనకి పిల్లలు పుట్టేసరికి అలాంటివి దొరకడం లేదు. ఇప్పుడు దొరికేవి తింటే వికార పెడుతోంది. అందుకే మనవాళ్లు తినమన్నారు. ఈవిడ ఎక్కడ కొందో కానీ, ఇవి చాలా చాలా బాగున్నాయి. ఏ స్టోర్లో దొరుకుతాయో చూడాలి'' అని.

పిల్లలా మాట విని వాటికోసం ఎగబడ్డారు.

శ్రీమతి మాటల ప్రభావమేమో, పిల్లలకి కూడా అవి చాలా నచ్చాయి.

''మా పిల్లలు ఓ పట్టాన బయట కొన్నవి ఏవీ తినరు. ఇవి వీళ్లకి చాలా నచ్చాయి. నిమ్మతొనలకీ, నీ సలహాకీ చాలా థాంక్స్'' అన్నాను నేను తెల్లామెతో.

"ఎక్కడివాళ్లయినా పిల్లలంతా ఒక్కటే" అని ఆమె సంబరపడింది.

ఈ ప్రహసనం జరుగుతుండగా కాసేపు మాకు టైం తెలియలేదు.

అంతలో మాకు పిలుపొచ్చింది. నలుగురం వెళ్లాం.

ఆఫీసరు నా వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

నాతో జర్మన్, ఇంగ్లీషులు కలిపి మాట్లాడేడు. నన్ను మాత్రం జర్మన్ భాషలో మాట్లాడమని నిర్దేశించాడు.

తప్పులొస్తే తను సరి చేస్తానన్నాడు.

అప్పటికి నాకు జర్మన్ భాష అంత ఫరవాలేదు.

నేను శ్రీమతికి కూడా అవసరమైన జర్మన్ నేర్పాను. చెప్పాలంటే తనకి ఇంగ్లీషుకంటే జర్మనే బాగా వచ్చు.

తను స్కూల్లో ఇంగ్లీషు చదువుకున్నా ఆ భాష వాడాల్సిన అవసరం ఇండియాలో అట్టే రాలేదు.

తను ఒరిస్సా రావడంతో – ఒరియా, హిందీ నాకంటే మెరుగ్గా అలవడ్డాయి.

ఇప్పుడు జర్మనీలో ఇక్కడి భాష అవసరం కాబట్టి అదీ వంటబడుతోంది.

నా శ్రీమతి కూడా జర్మన్ మాట్లాడగలదని అతడికి చెప్పాను.

అందుకు ఆమె నావంక గుర్రుగా చూసింది కానీ – అతడి ముఖం వెలిగింది.

ఎంతలా వెలిగిందంటే – ఆ వెలుగులో నాకు మావాళ్ల రెసిడెన్స్ పెర్మిట్ కనబడింది.

మావాళ్లకి రెసిడెన్స్ పెర్మిట్ ఇవ్వడానికి సమస్యేముండదని స్పష్టం చేశాడతడు.

కానీ, అందుకు మావాళ్లకి ఇన్సూరెన్సు తీసుకోవాలన్నాడు.

‘‘తీసుకుంటాను. ఇన్సూరెన్సుకి మావాళ్లకి ఫార్మాలిటీస్ ఏమైనా ఉంటాయా?’’ అనడిగాను.

నవ్వేసి, పాస్‌పోర్టుంటే చాలన్నాడు. బాగుందనుకున్నాను.

‘‘ఇన్సూరెన్స్ తీసుకున్నాక ఆ డాక్యుమెంట్సుతో మళ్లీ వస్తాను’’ అన్నాను అతడితో ఉత్సాహంగా.

‘‘ఆ డాక్యుమెంట్సుతోపాటు నీ మారేజ్ సర్టిఫికెట్ కూడా తీసుకురావడం మర్చిపోకు’’ అన్నాడతడు యథాలాపంగా.

‘‘ఊఁ’’ అని ఉలిక్కిపడి, ‘‘మ్యారేజ్ సర్టిఫికేట్టేమిటి?’’ అన్నాను.

పెళ్లి చేసుకుంటే చేసుకున్నట్లు ఓ సర్టిఫికెట్టుండాలని నాకెప్పుడూ స్ఫురించలేదు.

ఆఫీసరు ఆశ్చర్యంగా, ‘‘ఈమె నీ భార్యంటున్నావు. మ్యారేజి సర్టిఫికెట్ గురించి తెలియదా? అంటే మీరిద్దరూ పెళ్లి చేసుకోకుండా కలిసుంటూ పిల్లల్ని కన్నారా?’’ అన్నాడు.

అతడి గొంతులో సందేహమే తప్ప వెటకారం లేదు.

అతడేమన్నాడో శ్రీమతికి తెలిసినట్లు లేదు. తెలిస్తే సిగ్గుతో కుంచించుకుపోయేదని తెలుసు.

ఆమె చాలా కుతూహలంగా మమ్మల్నిద్దర్నీ చూస్తోంది.

అతడి ఈ సందేహం ఆమెకి అర్థం కాకపోవడం అదృష్టం అనుకున్నాను.

‘‘మాకు పెళ్లయింది. మేమిద్దరం భార్యాభర్తలం. ఆ విషయం పాస్‌పోర్టులో ఉంది’’ అన్నాను ఉక్రోషాన్ని దిగమింగుకుంటూ.

అతడు చలించలేదు, ‘‘పాస్‌పోర్టు ఆఫీసరు మీపెళ్లి చూశాడా?’’ అన్నాడు.

తడబడినా తల అడ్డంగా ఊపాను.

‘‘మరి మీకు పెళ్లయినట్లు ఆ ఆఫీసరుకెలా తెలుసు? మ్యారేజి సర్టిఫికెట్ చూపించి ఉంటావు. నేనడుగుతున్నది ఆ సర్టిఫికెట్ గురించి’’ అన్నాడతడు.

అటు తిప్పి ఇటు తిప్పి మళ్లీ సర్టిఫికెట్ టాపిక్‌కే వచ్చాడు.

''నిజం చెబుతున్నాను. మా పెళ్లికి సర్టిఫికెట్ లేదు. నాకు తెలిసి ఇండియాలో పెద్దలు చేసిన పెళ్లిళ్లకి సర్టిఫికెట్లుండవు'' అన్నాను.

''సర్టిఫికెట్ లేకుండా పెళ్లేమిటి? అది చెల్లదు'' అన్నాడు ఆఫీసరు.

అప్పటికి మా పెళ్లయి ఎనిమిదేళ్లు దాటింది. ఇద్దరు పిల్లలు.

ఇప్పుడు మా పెళ్లి చెల్లదని – ఇక్కడి ఆఫీసరు అంటున్నాడు.

మా పెళ్లి విషయంలో ఇలాంటి సమస్యొకటి రావచ్చని నేనూహించలేదు.

ఏంచెయ్యాలో తోచలేదు.

సర్టిఫికెట్ లేని కారణంగా నా కుటుంబం అర్థాంతరంగా ఇండియాకి వెళ్లిపోవాల్సి వస్తుందా అన్న బెంగ కలిగింది.

మేకపోతు గాంభీర్యం తెచ్చుకుని, ''పెళ్లికి సర్టిఫికెట్ ముఖ్యమని మొదటిసారి వింటున్నాను. అసలు పెళ్లిళ్లకి సర్టిఫికెట్లు ఎందుకు?'' అన్నాను.

''మ్యారేజి సర్టిఫికెట్ లేకుండా రేపు అవసరమైతే విడాకులు ఎలా తీసుకుంటావ్?'' అన్నాడు.

తెల్లబోయాను.

సర్టిఫికెట్ అవసరం విడాకులకా?

వెంటనే పుంజుకుని, ''కావాలంటే రాసిస్తాను. నేను, నా భార్య జీవితాంతం కలిసే ఉంటాం. మా మధ్య విడాకుల ప్రసక్తే ఉండదు. మా సంప్రదాయంలో విడాకులుండవు. అందుకేనేమో సర్టిఫికెట్లూ లేవు'' అన్నాను.

ఆఫీసరు తెల్లబోయాడు.

టైం చూసుకుని, ''నీ కేసు నాకు చాలా చిత్రంగా ఉంది. ఇంకా చాలా మాట్లాడాలనుంది. కానీ బయట చాలామంది వెయిటింగులో ఉన్నారు. కాబట్టి నువ్విక వెళ్లొచ్చు. మళ్లీ వచ్చేటప్పుడు మ్యారేజి సర్టిఫికెట్ తీసుకురాక తప్పదు'' అన్నాడు.

''లేని సర్టిఫికెట్ ఎక్కణ్ణించి తెచ్చేది? మావాళ్లని అర్థాంతరంగా ఇండియాకి పంపెయ్యడం ఒక్కటే ఇక మిగిలిన మార్గం. ఇంకో మాట చెప్పు'' అని దీనంగా అడిగాను.

జాలేసిందో ఏమో, ''ఓ ఉపాయముంది. పాస్‌పోర్టులో నీకు పెళ్లయినట్లుగా ఉంది కదా! ఇక్కడ బెర్లిన్లో ఇండియన్ కన్సలేట్ ఆఫీసుంది. నీ పాస్‌పోర్టు చూసి ఆ ఆఫీసువాళ్లు మ్యారేజ్ సర్టిఫికెట్టిస్తే అది మాకు సరిపోతుంది'' అన్నాడు.

''హమ్మయ్య! ప్రస్తుతానికో దారి కనిపించింది'' అనుకున్నాను.

జరిగిన సంభాషణ సారాంశం తెలుసుకున్నాక, ''పెళ్లికి సర్టిఫికెట్టా– అదీ విడాకులకోసం?'' అని షాక్ తింది శ్రీమతి.

''వాళ్లడిగారు. మనం ఇవ్వాలి. ఇందులో చర్చలకూ, వాదనలకూ తావు లేదు'' అన్నాను.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments